కథ

# శ్రీరాం... C/o. పెళ్ళాం

అవధానుల సుధాకరరావు



“ఏమండీ! తెల్లవారు ఝామున నాకో కలొచ్చింది..” చెప్పింది శ్రీలక్ష్మి భర్తతో, ఉదయం ఏడు గంటలప్పుడు ‘టీ’ తాగుతున్న సమయంలో.

“ఆ కలలో ఏడు పెట్టెలు..” అన్నాడు శ్రీరాం, పేపర్‌లోంచి తలెత్తి చూస్తూ.

“నిజమే అందామె” ఆశ్చర్యంగా.

“మొదటి పెట్టె నిండా కరెన్సీ”

“వామ్మో! ఇదీ నిజమే..”

''రెండో పెట్టెలో ధగధగ మెరిసే బంగారు నగలు..''

''మూడో పెట్టెలో ..?'' ప్రశ్నించింది, ఈసారి తప్పు చెప్తాడనే నమ్మకంతో.

''కళ్లు చెదిరే కలర్స్‌తో కాస్ట్లీ చీరలు..'' ఆ తరువాత నాలుగు, ఐదు, ఆరు, ఏడు పెట్టెల్లో ఉండే ఆమె కిష్టమైన వస్తువుల జాబితాని గడగడా చెప్పేశాడు.

''ఏమో అనుకున్నా! గడుసువారే! ఇంతకీ ఎలా కనిపెట్టారు?'' ఆసక్తిగా, కళ్లు తిప్పుతూ అడిగింది.

''మైడియర్ వైఫ్'' కొంచెం 'స్టైల్' కొడుతూ మొదలెట్టాడు శ్రీరాం. ''బియ్యంలో రాళ్లేరడం నీకెలా సింపులో, నీ మైండులో ఆలోచనలు, నీ కళ్లు కనే కలలు.. ఇట్టే పసిగట్టేస్తాను. ఎనిమిదేళ్ల మన కాపురంలో నీ హోల్‌బాడీనే కాదు-అంతరంగాన్ని కూడా పుస్తకంలా చదివేసాను'' అప్పుడతను బనియన్ మీదుండబట్టి, సవరించుకోవడానికి కాలర్ ఉండదు కాబట్టి, గొంతునే సవరించుకుని చెప్పాడు. ''గొప్పేలే..'' అన్నట్టు వయ్యారంగా మూతి తిప్పింది శ్రీలక్ష్మి.

శ్రీరాంకెప్పుడూ పెళ్లాం మీదే ధ్యాస. ఆఫీసుకెళ్లినా చీటికి మాటికి ఇంటికి ఫోన్ చేసి పలకరిస్తుంటాడు. ''అన్నం తిన్నావా..? పనిమనిషి వచ్చిందా? నువ్వు ఎక్కువగా పనిచేసి, కష్టపడిపోకు. బాగా రెస్ట్ తీసుకో..'' అంటూ ప్రేమ వొలకబోస్తుంటాడు. శ్రీలక్ష్మికేమో చిరాకేస్తుంటుంది. ఆమెకు చీరల పిచ్చి. ఎప్పుడూ డబ్బు గురించే ఆలోచిస్తూంటుంది. ధనలక్ష్మి కరుణించాలని, కాసుల గలగల ధ్వని ఇంట్లో మారుమ్రోగాలని అమ్మవారికి రోజు కుంకుమ పూజ చేస్తూ, గణగణమని గంట మోగిస్తూ వుంటుంది.

శ్రీరాం టేస్టే వేరు. ప్రమోషన్లు, డిపార్ట్‌మెంట్ టెస్టుల ఊసే ఎత్తకుండా. ఎంచక్కా ఐదుంబావుకల్లా ఇంటికొచ్చేసి, లుంగీ కట్టుకొని, భార్య వెనకే ఇంట్లోకి, బయటికి తిరుగుతుంటాడు. శ్రీలక్ష్మికి అతని తీరు, ధోరణి విచిత్రంగా అనిపించి, 'హవ్వా! ఇదేం చోద్య మండీ? ఎనిమిదేళ్లవుతున్నా, కొత్త పెళ్లికొడుకులా నా కొంగుపట్టుకొని తిరుగు తారేంటండి? అందుకే మీకు 'కేరాఫ్ పెళ్లాం' అని బిరుదు ప్రసాదించారు మీ ఫ్రెండ్స్'' అంది బుగ్గలు నొక్కుకుంటూ.

శ్రీరాం తాపీగా ''ఏం ఫర్లేదు! కేరాఫ్ బారు...'' అనిపించుకోవడం కంటే ఇది బెటర్ కదా అన్నాడు. శ్రీలక్ష్మి చురచురా చూసింది ఆ మాటకి.

''బొత్తిగా తెలివితేటల్లేవు నా మొగుడికి..'' అంది నెత్తికొట్టుకుంటూ.

''నిన్నగాక మొన్న ఉద్యోగంలో చేరినవాళ్లు, రెండు చేతులా సంపాయిస్తూ మేడలు కడుతున్నారు. ఖరీదైన కార్లలో షికార్లు కొడుతున్నారు. నేనేమో పిచ్చిదానిలా ఇంటి ముందు నిల్చుని వాళ్లని చూస్తూ వుండాలి'' ముక్కు చీదడం మర్చిపోయి, డైలాగంతా చెప్పేసింది.

''మైడియర్ లక్ష్మి రాజ్యం! నువ్వే నా ప్రేమ సామ్రాజ్యం...'' అన్నాడు నాటకీయంగా, చేతులు బారచాచి, ఆ పైన ఎంత డబ్బుంటేనేం బంగారం తింటామా? వెండిని కరిగించుకొని దాహం తీర్చు కుంటామా? శ్రీ డార్లింగ్! నాకు సినిమాలు చూడ్డం కంటే-అందమైన నీ ముఖంలోకి రోజుల తరబడి చూస్తూ కూర్చోవడమే ఇష్టం! అక్రమ సంపాదనతో గడించిన రూపాయల్ని లెక్కబెట్టడం కంటే- ఇదిగో పెందలాడే ఇంటికొచ్చి నీతో వాదన వేసుకోవడం, పనిమనిషి ఉతికి ఆరేసిన నీ చీరలు, వగైరాలు మడతలు పెట్టడం నా ఫేవరేట్ యాక్టివిటి....''

''కాని నాకు మాత్రం మీరు నాలుగు ఫైళ్లు రాసి, నాలుగురాళ్లు సంపాయించి, నాకో గిఫ్ట్ పట్టుకొస్తే సంతోషం కలుగుతుంది...''

''ఈ దాంపత్య జీవితమే ఒక గిఫ్ట్ మనకి! అది చాలదా దేవి?''

''జోక్ కాదు రాం! నువ్వెప్పటికీ- 'శ్రీరాం కేరాఫ్ పెళ్లాం'గానే వుండాలి. వుంటావు కదూ... మన బంధువులు, మీ కొలీగ్స్ ఎలా అనుకున్నా సరే...''

''అలా అనుకొని తృప్తిపడేవాళ్లకి ఏం చెప్పగలం? మొన్ననే మాధవి వాళ్లు ఊటికి వెళ్లారు... పదిహేన వసారట..'' చివరి పదం చాలా గట్టిగా చెప్పింది. అక్కసు ధ్వనించేలా.

అయినా శ్రీరాం కూల్‌గానే వున్నాడు. ''కాపురం అన్యోన్యంగా వుండాలి గాని! ఊటికి పదిహేనుసార్లు, కాశ్మీరుకు ముప్పైసార్లు వెళ్లొస్తే సరిపోతుందా? నీకు తెలుసా... శాడిస్టు భర్త చేతిలో మాధవి చిత్రహింసలు పడుతోంది...'' శ్రీలక్ష్మి తల కిందికేసింది. ఆ మాట నిజమేకాబట్టి.

★ ★ ★

శ్రీరాంకి పిచ్చిపట్టినట్లుగా వుంది. శ్రీలక్ష్మి పుట్టింటికి వెళ్లింది.

''మళ్లీ ఎప్పుడొస్తావు లక్ష్మీ?'' దీనంగా అడిగాడు బస్సు కదులుతుంటే...

''ఖచ్చితంగా పదిరోజులు లెక్కేసుకోండి...'' అంది మొండిగా.

ఆమెతో పాటు తనూ వెళ్లేవాడే. కానీ... సిగ్గు అడ్డొచ్చింది. శ్రీలక్ష్మి అన్నయ్య కూతురు సవర్తయిందట. వ్యవహారం చూస్తే ఆడవాళ్లది. ఆ ఫంక్షనుకు తను వెళితే బాగోదని ఆగిపోయాడు. అందునా అట్నుంచి అతనికి ఆహ్వానమూ లేదు. మోహన్ ఫోన్ చేసి, 'బావగారూ! చెల్లాయిని ఓ నాలుగు రోజులు ముందే పంపండి..' అని మాత్రమే రిక్వెస్టు చేశాడు. ఈ ఆడ వాళ్లకి పుట్టింటి ప్రయాణాలంటే తెగ హుషారు. ఇక్కడ తను... ఇంట్లో ఒంటరిగా, చీకట్లో లైటయినా వేసు కోకుండా, 'మందు' తాగలేక, మాటి మాటికి బిందెలో నీళ్లు తాగేస్తూ ఎడబాటు పాటలు పాడుకుంటున్నాడు, ఓ టవల్‌నే శాలువాగా కప్పుకొని.

''కనీసం ఫోనయినా చేస్తుంటావా శ్రీ అప్పుడ ప్పుడు...'' అనడిగితే- 'నో' అందామె కచ్చగా. అక్కడ పదిరోజులు హాయిగా గడుపుతాను మా వాళ్ల మధ్య. ఈ ఊరిని కూడా తలుచుకోను. మీరేవరో... నేనె వరో...'' అంది.

''ఎందుకింత కఠినత్వం ప్రేయసి?'' అని అతని ఆక్రోశం ఆమెకి వినిపించకుండా అప్పుడు గట్టిగా హారన్ కొట్టి ఒక్కసారిగా, బస్సుని స్టార్ట్ చేశాడు డ్రైవరు. శ్రీలక్ష్మిని తననుంచి వేరేచేశాడు... ఎంత దుర్మార్గుడు ఆ డ్రైవరు?

★ ★ ★

''రాం! నేను 'శ్రీ'ని మాట్లాడుతున్నా...'' ఫోన్‌లో భార్య గొంతు విని, ఉబ్బితబ్బిబ్బయ్యాడు శ్రీరాం. మళ్లీ ఆమె... ''నాకో మాటిస్తావా రాం!'' అనడిగింది కొంచెం నెర్వస్‌గా.

''ఏంటి లక్ష్మీ? టెన్షన్‌గా వున్నావేంటి? నా జీవితమే నీ సొంతం. చెప్పు... ఏం చెయ్యమంటావు? దయచేసి టూవీలర్ డ్రైవింగ్ నేర్చుకోమని మాత్రం అడక్కేం'' అన్నాడు.

''జోక్ కాదు రాం! నువ్వెప్పటికీ- 'శ్రీరాం కేరాఫ్ పెళ్లాం' గానే వుండాలి. వుంటావు కదూ... మన బంధువులు, మీ కొలీగ్స్ ఎలా అనుకున్నా సరే...''

''ఓకే.. శ్రీ... నీ మాటలు నాకు వింతగా వున్నాయి. ఇంతకీ ఎక్కడ్నుంచీ నువ్వు మాట్లాడేది?'' అనుమా నమొచ్చి అడిగాడు.

''స్వీట్ సర్‌ప్రయిజ్...''

''ప్లీజ్ చెప్పవా...''

''ఆఫీస్ నుంచి నువ్వు ఐదున్నరకి ఇంటికొస్తా వుకదా! ఇంకో అరగంటకి నేను నీ కళ్ల ముందుంటా చాలా..'' అంది శ్రీలక్ష్మి. భర్త మీద ప్రేమ కడలి తరంగల్లా ఉప్పొంగుతోంది. ఎప్పటికీ అతడే తన భర్త కావాలి. అదొక్కటే కోరిక ఇప్పుడామె మనసులో. ఈ మార్పు ఎలా, ఎందుకు? అంటే...

అమలాపురంలో శ్రీలక్ష్మికిద్దరు ప్రాణస్నేహితు రాళ్లున్నారు. అందులో ఒకామె భర్త చాలా అందగాడు. వయసు నలభై లోపే. వారం క్రితం బ్లడ్ క్యాన్సర్‌తో పోయాడు. ఇంకో స్నేహితురాలు వుంది. భర్త లంచగొండి. ఏసిబికి పట్టుపడి జైలుపాలయ్యాడు. ఇలా ఒక వ్యక్తి అకాల మృత్యువుకి గురై ఫొటోకి దండ వేయించు కున్నాడు. ఇంకొకడు అత్యాశకు పోయి చేతులకి బేడీలు వేయించుకున్నాడు. శ్రీలక్ష్మి ఇప్పుడు డబ్బుకోసం ఆరాటపడడం లేదు. నా 'రాం' ఎప్పటికీ క్షేమంగా వుండాలి అనుకుంటోంది. ఆ ఆరాటంతోనే ఉన్నపళంగా బయల్దేరి వచ్చేస్తోంది ప్రియమైన మొగుడి దగ్గరకు.

★